

మలయప్ప అలంకరణలో శ్రీవారు

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారిని బుధవారం మలయప్ప స్వామిగా అలంకరించారు.



హైకోర్టు జడ్జి పూజలు

నగరంపాలెం: గుంటూరు కొత్తపేటలోని శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామిని రాష్ట్ర హైకోర్టు జడ్జి ప్రతాపవెంకట జ్యోతిర్మయి బుధవారం దర్శించుకున్నారు. పూజలు చేశారు.

ఆటో దహనం



వెల్దుర్తి: శిరిగిరిపాడు గ్రామానికి చెందిన పెద్దారపు గంగాధరానికి చెందిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి పెట్రోల్ పోసి దహనం చేశారు. ఆటోను ఇంటి సమీపంలోని స్థలంలో ఉంచగా, ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు.

న్యూస్‌రీల్

మన దేశం సర్వమత సమ్మేళనం



తాడేపల్లిరూరల్ : మన భారత దేశం సర్వమత సమ్మేళనం అని శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి అన్నారు. బుధవారం మంగళగిరిలోని బాపూజీ విద్యాలయంలో ధనుర్మాస మహోత్సవాలలో భాగంగా 10వ పాశురాన్ని భక్తులకు స్వామివారు వివరించారు. క్రిస్మస్ సందర్భంగా యావత్ క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎన్నో తరాలుగా ఎటువంటి భేదం లేకుండా అంతా ఈ దేశంలో నివసిస్తున్నామని, ముందు ముందు కూడా ఇలానే కలసి మెలసి ఉండాలని ఆయన అన్నారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ ధనుర్మాస మహోత్సవాలలో భాగంగా విజయవాడ, నరసరావుపేట, మచిలీపట్నం ప్రాంతాల నుంచి సుమారు 280 మంది భక్తులు గోదా అమ్మవారికి సారె సమర్పించారని తెలిపారు.

దేవాలయంలో సంకీర్తన గానం



తెనాలి: పట్టణంలోని నెహ్రూరోడ్డులో శ్రీరుక్మిణి సమేత గోవర్ధన స్వామి- శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం సాయంత్రం శ్రీహరినామ సంకీర్తన బృందంచే సంకీర్తన గానం జరిగింది. గురువు పెరవలి వంశీకృష్ణ, అందె బాలచంద్రమౌళి, అందె రాజేశ్వరి, తన్మయి మాదల సాయి హనుమంత రావు, నాగఅర్చన, రూపశ్రీ, నందిపాటి దుర్గామల్లేశ్వరి, దంటు శర్వాణి, పువ్వాడ విష్ణుప్రియ, శ్రీపూజిత, కొప్పురపు అనిత మాధవి, నంది కంటి జయలక్ష్మి, పూజిత, టీవీ ఎస్ శాస్త్రి సంకీర్తనలో గానం చేశారు. హిందూ ధర్మప్రచార పరిషత్, టీటీడీ సంయుక్త ఆధ్వర్యంలో 'వారం వారం భజన'లో భాగంగా శ్రీఆంజనేయ స్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు లక్ష్మీనారాయణ నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇదే బృందంచే ఈనెల 27న తిరుమలలో భక్తిరంజని ఉంటుందని గురువు పెరవలి వంశీకృష్ణ తెలియజేశారు.

నేడు లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



గుంటూరు రూరల్: నల్లపాడు గ్రామం వెంగళాయపాలెం రోడ్డులోని స్వయంభూ శ్రీ పుష్పాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వాతి నక్షత్రం సందర్భంగా శ్రీ పుష్పాద్రి లక్ష్మీ నరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు, అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయడం, అన్న సంతర్పణ జరుగుతుందన్నారు.

ఓం శ్రీఅమ్మయే శరణం తిరుపతాంబ

వైభవంగా తిరుపతమ్మ మండల దీక్షలు



పెనుగంచిప్రోలు: ఓం శ్రీఅమ్మయే శరణం తిరుపతాంబ...ఓం శ్రీస్వామియే శరణం గోపయ్య...అంటూ అమ్మవారి శరణుఘోషతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ మండల దీక్ష మాలధారణ బుధవారం వైభవంగా ప్రారంభమైంది. తొలుత ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఎదుట ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈఓ కిషోర్‌కుమార్, ప్రధానార్చకుడు మర్రెబోయిన గోపిబాబు సమక్షంలో అర్చకులు సూరిబాబు, ప్రసాద్ ముందుగా మాల వేసుకుని మాలధారణ ప్రారంభించారు. అనంతరం ఆలయ అర్చకులు మాల వేసుకున్నారు. మొదటి రోజు సుమారు1000 మందికి పైగా స్వాములు మాలలు వేసుకున్నారు. మాల వేసుకున్న దీక్షాధారులకు సింగరాయకొండకు చెందిన శివమ్మస్వామి దంపతులు ఉచితంగా పులిహోర, లడ్డూ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు బెజవాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.







చీరాలలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు , బాపట్ల సీబీజడ్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైసవ సోదరులు

క్రీస్తు జననం.. దైవ స్మరణం

బాపట్ల జిల్లాలో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు చర్చిల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచే ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం ప్రత్యేక ప్రార్థనల్లో క్రైస్తవులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఏసు క్రీస్తు జననం సందర్భంగా ప్రత్యేక ప్రతిమలు ఏర్పాటు చేసి, ఆరాధించారు. ముఖ్యంగా బాపట్ల, చీరాల, రేపల్లె, పర్చూరు, మార్టూరు ప్రాంతాల్లోని ప్రముఖ చర్చిల్లో వేడుకలకు భారీగా క్రైస్తవులు తరలివచ్చారు.

–సాక్షి, నెట్‌వర్క్

రహదారులు ఛిద్రం

- గుంతలు పూడ్చని కూటమి సర్కారు
- చినుకు రాలితే రాకపోకలకు నరకయాతన
- ఎన్నికల ముందు జగన్ సర్కార్‌పై నిందలు
- పగ్గాలు చేపట్టాక పట్టించుకోని పరిస్థితి
- జిల్లాలో మరింత అధ్వానంగా రహదారులు
- కూటమి పాలన తీరుపై మండిపడుతున్న జనం

రూ.113.71 కోట్లతో మరమ్మతులు అంటూ ప్రకటన



అధ్వానంగా ఉన్న బల్లికురవ -మార్టూరు ఆర్ అండ్ బీ రోడ్డు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: 'ఐదేళ్ల పాలనలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రహదారులను పట్టించుకోలేదు. అన్నీ పాడయ్యాయి. అడుగుతీసి అడుగుపెట్టే పరిస్థితి లేదు. వాహనాలు ముందుకు కదిలే అవకాశంలేదు. మాకు అధికారం అప్పగిస్తే మొదట పాడైన రోడ్లన్నింటినీ బాగుచేయడమే కాదు అన్ని కొత్తరోడ్లుగా మారుస్తాం.' ఎన్నికల సమయంలో చంద్రబాబుతోపాటు కూటమి నేతలు పదేపదే చెప్పిన మాటలు ఇవి. కూటమి సర్కారు కొలువుదీరి ఏడు నెలలు పూర్తి కావస్తోంది. సంక్రాంతి పండుగ నాటికి రాష్ట్రంలో ఉన్న రోడ్లన్నింటినీ అద్దంలా మారుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. సంక్రాంతి పండుగకు కేవలం 15 రోజులే గడువు ఉంది. కానీ ఇంతవరకు ఒక్క రహదారిపై గుంతలు పూడ్చిన దాఖలాలు లేవు. ఈ రహదారులపై రాకపోకలు కష్టతరంగా మారాయి.

కూటమి సర్కారు కొలువు దీరాక జిల్లాలో రూ.113.71 కోట్లతో 167 కిలోమీటర్ల మేర రోడ్ల మరమ్మతులు చేపడుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా మొక్కుబడిగా కూడా పనులు చేయలేదన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో అధ్వానంగా మారిన రోడ్లను చూస్తే ఈ విషయం తేటతెల్లమవుతుంది. ఇప్పటికైనా కూటమి సర్కారు రోడ్లను బాగుచేసి ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలుపుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గుంతల రహదారులే దిక్కు

- మంత్రి అనగాని సత్యప్రసాద్ సొంత నియోజకవర్గం రేపల్లెలో రహదారులు పూర్తిగా దెబ్బతిని అధ్వానంగా మారాయి. రేపల్లె నుంచి సజ్జావారిపాలెం వెళ్లే రోడ్డు 4 కిలోమీటర్ల మేర దెబ్బతింది. 8 కిలోమీటర్లు ఉన్న కూచినపూడి-నిజాంపట్నం రోడ్డు, సజ్జావారిపాలెం-నగరం, 14 కిలో మీటర్ల మేర ఉన్న పెనుమూడి-లంకెవానిదిబ్బ, 10 కిలోమీటర్ల అరవపల్లి-నల్లూరిపాలెం, 4 కిలోమీటర్లు ఉన్న గంగడిపాలెం-మోళ్లగుంటతోపాటు నియోజకవర్గంలో పలు రహదారులు పాడయ్యాయి.
- మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న వేమూరు నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. చుండూరు మండలంలో రెండు కిలో మీటర్లు ఉన్న పెనపాడు-చిన్నపరిమిరోడ్డు, మూడు కిలోమీటర్ల చిన గాదెలవర్రు, పాంచాలవరం-యలవర్రు, కొల్లూరు కరకట్ట-పెసర్లంక అరవిందవారధి, 2 కిలోమీటర్ల పెదగాదెలవర్రు, దోనెపూడి-పోతార్లంక, తెనాలి-రేపల్లె అడ్డరోడ్డు-రావికంపాడు, 5 కిలోమీటర్ల వేమూరు-చావలి, 20 కిలోమీటర్లు ఉన్న పెదరావూరు- చెరుకుపల్లి, 4 కిలోమీటర్ల పాంచాలవరం, చిలుమూరు- తెనాలి మెయిన్‌రోడ్డు, భట్టిప్రోలు- వెల్లటూరుతో పాటు పలురోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి.
- పర్చూరులోనూ రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉంది. 14కిలోమీటర్లు ఉన్న ఇంకొల్లు-పర్చూరు రోడ్డు పూర్తిగా పాడైపోయింది. 8 కిలోమీటర్ల మార్టూరు-గన్నవరం, పూనూరు-నూతలపాడు, 5 కిలోమీటర్లు ఉన్న యద్దనపూడి, చిమటావారిపాలెం-మున్నంగివారిపాలెం, స్వర్ణ-జరుబులవారిపాలెం, కారంచేడు-ఆదిపూడి, మార్టూరు-గన్నవరం, మున్నంగివారిపాలెం-జాగర్లమూడి, 3కిలోమీటర్ల గన్నవరం-పూనూరు, 14 కిలోమీటర్ల ఆదిపూడి-కారంచేడు, 2 కిలోమీటర్ల జొన్నతాలి- చిమ్మిరిబండతోపాటు పలు రోడ్లు దెబ్బతిన్నాయి.
- బాపట్ల నియోజకవర్గంలోనూ రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. 10 కిలోమీటర్ల కర్లపాలెం-పెద్దపులుగువారిపాలెం, 6 కిలోమీటర్ల యేట్రవారిపాలెం- అప్పికట్ల, అప్పికట్ల- మర్రిపూడి, పెదగొల్లపాలెం- తుమ్మలపల్లి, నరసాయపాలెం- జమ్ములపాలెం, వెదుళ్లపల్లి-కంకటపాలెం, 15 కిలోమీటర్ల చందోలు-పొన్నూరు, 8 కిలోమీటర్ల బాపట్ల- పాండురంగాపురంతో పాటు పలు రోడ్లు పాడయ్యాయి.
- చీరాల నియోజకవర్గంలో పలు రహదారులు దెబ్బతిన్నాయి. రెండు కిలోమీటర్ల బుర్లవారిపాలెం-హైవేరోడ్డు, ఈపూరుపాలెం- తోటవారిపాలెం, కిలోమీటర్ ఉన్న దండుబాట-కేపీ పాల్ కాలనీ, బైపాస్‌రోడ్డు-యానాదికాలనీతో పాటు నియోజకవర్గంలో పలురోడ్లు పాడయ్యాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



రేపల్లె మండలం గంగడిపాలెం-మోళ్లగుంట రహదారి



కొల్లూరు-కొత్తూరులంక ఆర్ అండ్ బీ రోడ్డు

అద్దంకిలో



మార్టూరు దండుదారి వద్ద రోడ్డు దుస్థితి

అద్దంకి నియోజకవర్గంలో రోడ్లు పాడయ్యాయి. అద్దంకి నుంచి మోదేపల్లి వరకూ 12 కిలోమీటర్ల మేర రోడ్డు పాడైంది. ఆరు కిలోమీటర్లు ఉన్న తిమ్మాయిపాలెం-రామాయిపాలెం, 16 కిలోమీటర్ల అద్దంకి-వెంపరాల, ఉప్పలపాడు-మైలవరం, 6 కిలోమీటర్లు ఉన్న శింగరకొండపాలెం- కొత్తరెడ్డిపాలెం, 10 కిలోమీటర్ల చెనుపల్లి-వైదన, అద్దంకి- వెంకటాపురం వయా నాగులపాడు, కొప్పరపాడు, కొత్తూరు-వెలమవారిపాలెం, 9 కిలోమీటర్ల ఉన్న అద్దంకి- సంతమాగులూరు, 11 కిలోమీటర్లు ఉన్న బల్లికురవ-కొనిదెన రోడ్లతోపాటు పలురోడ్లు దెబ్బతిన్నాయి.

క్రీస్తు మార్గంలో పయనించాలి

ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్



ప్రార్థనల్లో ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల: క్రీస్తు మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా బుధవారం సీబీజడ్ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొని క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు సందేశం మానవాళి అందరికీ స్ఫూర్తిదాయం అన్నారు. స్థానిక సంఘ కాపరి రెవరెండ్ ఎం పవిత్రకుమార్ ఏసుక్రీస్తు ప్రభువు ఈ లోకంలో జన్మించుటతో మానవాళికి ప్రభువు ఆశీర్వాదములను వివరించారు. ఏసుప్రభు గురించి ఎంపీ పలు విషయాలు వివరించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించుము అనే వాక్యాన్ని వివరించారు. క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎం.పవిత్రకుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సాధు హెర్బర్ట్, కార్యదర్శి క్రిస్టఫర్, రెవరెండ్ రాహుల్ దేవ్, ఎలీషియారావు, రాజు, ఎస్.త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 1616 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 70 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 67 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 73 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 1095 క్యూసెక్కులు విడుదల చేశారు.



భార్యాభర్తలను ఢీకొన్న లారీ



108 వాహనంలో తోక వెంకాయమ్మ



లారీ కింద మృతుడు కొండయ్య

భర్త మృతి, భార్యకు తీవ్రగాయాలు

నకరికల్లు: స్థానిక అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారిపై ఘోర రోడ్డుప్రమాదం సంభవించింది. రోడ్డు దాటుతున్న భార్యాభర్తలను ఢీకొన్న లారీ వేగం నియంత్రించుకోలేక ఎదురుగా ఉన్న ఆర్టీసీ బస్సును కూడా వెనుక నుంచి ఢీకొట్టింది. భార్యాభర్తలు ఇద్దరూ లారీ కింద పడడంతో భర్త మృతి చెందగా భార్యకు తీవ్రగాయాలయ్యాయి. ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. ఈ ఘటన నకరికల్లులోని రాష్ట్ర రహదారిపై బుధవారం సంభవించింది. వివరాల్లోకి వెళితే.. నరసరావుపేట బస్టాప్ నుంచి పిడుగురాళ్ల బస్టాప్ వైపు వెళ్లేందుకు రోడ్డుదాటుతున్న భార్యాభర్తలను చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ వేగంగా ఢీకొంది. దీంతో వారిద్దరూ లారీ కింద పడిపోయారు. వేగం నియంత్రణ కాకపోవడంతో ఎదురుగా ఉన్న ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. బస్సు వెనుక భాగం దెబ్బతింది. ప్రయాణికుల ఆర్తనాదాలతో ప్రజలు పెద్దసంఖ్యలో ఘటనాస్థలానికి చేరుకున్నారు. లారీ కింద పడి ఉన్న భార్యాభర్తలను కొద్దిసేపటి వరకు గుర్తించలేకపోయారు. స్థానికులు అతికష్టం మీద లారీ కింద పడి ఉన్న క్షతగాత్రులను బయటకు తీశారు. క్షతగాత్రులిద్దరూ మండలంలోని చీమలమర్రి గ్రామానికి చెందిన తోక వెంకాయమ్మ, కొండయ్య(56)లుగా గుర్తించారు. ప్రమాదంలో వెంకాయమ్మ, కొండయ్యలకు తీవ్రగాయాలు కాగా కొండయ్య కొన ఊపిరితో ఉన్నాడు. 108 వాహనంలో క్షతగాత్రులను నరసరావుపేటలోని వైద్యశాలకు తరలించే క్రమంలో కొండయ్య మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు ప్రయాణికులు క్షేమం

అనుకోని ఘటనకు బస్సులోని ప్రయాణికులు ఉలిక్కిపడి ఆర్తనాదాలు చేశారు. స్పందించిన స్థానికులు ప్రయాణికులను క్షేమంగా బయటకు దించారు.

రాష్ట్ర రహదారిపై భారీగా నిలిచిన ట్రాఫిక్

రోడ్డుప్రమాదానికి కారణమైన లారీ, ఆర్టీసీ బస్సు నడిరోడ్డుపై ఆగిపోవడంతో ట్రాఫిక్ భారీగా నిలిచింది. సుమారు గంటకు పైగా ట్రాఫిక్ నిలవడంతో వాహనాలు బారులుతీరాయి. ఘటనాస్థలానికి చేరుకున్న ఎస్ఐ చల్లా సురేష్, సిబ్బంది క్షతగాత్రులను 108లో నరసరావుపేట వైద్యశాలకు తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నత్తనడకన రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు

- అగచాట్లు పడుతున్న ప్రయాణికులు
- ఏడాది దాటినా 50 శాతం పూర్తికాని పనులు
- త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్న ప్రయాణికులు, ప్రజా సంఘాలు



నిర్మాణంలో ఉన్న రేపల్లె రైల్వేస్టేషన్

రేపల్లె రూరల్: రేపల్లె రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఏడాది కిందట చేపట్టిన పనులు యాభై శాతం కూడా పూర్తి కాకపోవడం గమనార్హం. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ భారత్ పథకంలో రేపల్లె రైల్వే స్టేషన్ ఎంపికైంది. రేపల్లె రైల్వేస్టేషన్‌లో నూతన భవనాల నిర్మాణం, ఆధునికీకరణ కోసం రూ.25.6 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్రమోడీ 2023 ఆగస్టు 7వ తేదీన వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. 2024 మార్చి నాటికి పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు రచించారు. అధికారుల పర్యవేక్షణ లోపం, గుత్తేదారుల నిర్లక్ష్యం కారణంగా నేటికీ 50 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. నెలల తరబడి సాగుతున్న పనులతో నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. భవన నిర్మాణానికి సంబంధించిన ముడి వస్తువులు స్టేషన్ ప్రాంగణంలో విచ్చలవిడిగా పడవేయటంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పటంలేదు. వృద్ధులు, గర్భిణులు స్టేషన్ నుంచి బయటకు వెళ్లాలన్నా, లోనికి రావాలన్నా మెట్లు లేకపోవటంతో పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారింది.

ఆదాయంలో రెండవ స్థానం

గుంటూరు రైల్వే డివిజన్‌లో ఆదాయంలో రెండో స్థానంలో ఉన్న రేపల్లె రైల్వేస్టేషన్ వసతుల కల్పనలో వెనుకంజలో ఉంది. కృష్ణా-గుంటూరు జిల్లాలోని తీరప్రాంత ప్రజలకు ప్రధాన రవాణా మార్గం రేపల్లె రైల్వేస్టేషన్ కావటంతో ఇక్కడి నుంచే వేల సంఖ్యలో నిత్యం రాకపోకలు సాగుతుంటారు. ప్రతి నిత్యం రేపల్లె రైల్వేస్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు 10వేల నుంచి 12వేల మంది వరకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం రూ.8 లక్షల వరకు ఆదాయం చేకూరుతుంది. అయినప్పటికీ ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించటంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు విఫలం అవుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

పనులు వేగవంతంచేయాలి



రేపల్లె రైల్వేస్టేషన్ అమృత భారత్ పథకం కింద ఎంపికై పనులు ప్రారంభం కావడం శుభసూచికమే. పనులు నత్తనడకన నడుస్తుండటం విచారకరం. స్టేషన్‌లోకి వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా ఇబ్బంది పడుతున్నాం. స్టేషన్‌లో తాగునీరు తగినంత లేదు. పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రయాణికుల ఇబ్బందులను తీర్చాలి.

సీవీ మోహనరావు, పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి, రేపల్లె

ఇబ్బందులు వర్ణనాతీతం



రేపల్లె రైల్వేస్టేషన్ నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణం సాగిస్తుంటారు. పనులు నత్తనడకన సాగుతుండడంతో ప్రయాణికులకు ఇబ్బందులు పడుతున్నారు. ప్లాట్‌పారం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. నిర్మాణ మెటీరియల్స్ ఎక్కడబడితే అక్కడ పడవేయటంతో ప్రమాదాలకు గురవుతున్నారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలి.

–యడ్లపల్లి కిషోర్‌బాబు

క్లుప్తంగా

పల్నాడు జిల్లాలో 170.2 మి.మీ. వర్షపాతం

- అత్యధికంగా రెంటచింతలలో 14.2 మి.మీ. నమోదు
- జిల్లా వ్యాప్తంగా వర్ష ప్రభావం

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో 170.2 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు బుధవారం తెలిపారు. 28 మండలాల్లో వర్షం కురవగా వాటిలో అత్యధికంగా రెంటచింతలలో 14.2 మి.మీ. వర్షపాతం నమోదు అయింది. మాచర్లలో 7.2 మి.మీ., వెల్దుర్తిలో 9.2, దుర్గిలో 8.4, గురజాలలో 4.6, దాచేపల్లిలో 7.4, కారెంపూడిలో 8.4 మి.మీ కురిసిందన్నారు. అలాగే పిడుగురాళ్లలో 10.2, మాచవరంలో 5.2, బెల్లంకొండలో 6.0, అచ్చంపేటలో 5.8, క్రోసూరులో 4.0, అమరావతిలో 4.6, పెదకూరపాడులో 5.0, సత్తెనపల్లిలో 5.6, రాజుపాలెంలో 3.8, నకరికల్లులో 4.4, బొల్లాపల్లిలో 1.4, వినుకొండలో 10.8, నూజెండ్లలో 7.4, శావల్యాపురంలో 3.2, ఈపూరులో 9.2, రొంపిచర్లలో 2.2, నరసరావుపేటలో 2.4, ముప్పాళ్లలో 4.2, నాదెండ్లలో 6.4, చిలకలూరిపేటలో 5.4, యడ్లపాడులో 3.6 మి.మీ. వర్షం పడింది.

27న మాస్టర్ మైండ్స్ జాబ్ మేళా

– అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్

గుంటూరు ఎడ్యుకేషన్: మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మాస్టర్‌మైండ్స్‌లో ప్రిన్సిపల్స్, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్, క్యాంపస్ ఇన్‌చార్జ్‌లు, క్లాస్ ఇన్‌చార్జ్‌లు, హాస్టల్ స్టాఫ్, అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, డీటీపీ ఆపరేటర్లు, కంప్యూటర్ హార్డ్‌వేర్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ సూపర్‌వైజర్లు, డ్రైవర్ పోస్టులకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్ విద్యార్హతలు కలవారు అర్హులన్నారు. 21- 45 ఏళ్ల లోపు వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు హాజరు కావచ్చని తెలిపారు. వేతనం రూ.10 వేల నుంచి రూ.40 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. దూర ప్రాంతాల వారికి భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు శుక్రవారం ఉదయం 10 గంటలకు బ్రాడీపేట 3/9లోని మాస్టర్ మైండ్స్ పుష్ప భవన్‌కు రెజ్యూమ్, విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 89784 80429 /30 /35, 91000 24059 ఫోను నంబర్లలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

29న పవర్ లిఫ్టింగ్ పోటీలు

మంగళగిరి: గుంటూరు జిల్లా సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ (మెన్ – ఉమెన్), బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 29వ తేదీన గుంటూరు ఏటీ అగ్రహారం 4వ లైనులో ఉన్న ది సెంట్రల్ స్కూల్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్మాకుల విజయ భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధానిలు బుధవారం తెలిపారు. పోటీల్లో పాల్గొనే పవర్ లిఫ్టర్లు వయసు ధ్రువీకరణ పత్రాలు తీసుకుని రావాలని పేర్కొన్నారు. 29న ఉదయం 7 గంటలకు పోటీలు ప్రారంభం అవుతాయని వెల్లడించారు. ఇతర వివరాల కోసం 97008 44497, 93463 07979 ఫోను నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దోమ కుట్టినట్టయినా లేదు..!

- రేపల్లె పట్టణంలో అస్తవ్యస్తంగా డ్రైనేజీ నిర్వహణ
- కనీస చర్యలు చేపట్టడంతో అధికారులు విఫలం
- రహదారులపైకి చేరుతున్న మురుగు నీరు
- పారిశుద్ధ్యలోపంతో నిత్యం దోమల విజృంభణ

పట్టణంలో మురుగు నీరు సక్రమంగా పారకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువల్లో వ్యర్థాలు, మట్టి పేరుకుపోయి మురుగునీరు రోడ్డుపైకి చేరుతోంది. దీంతో దుర్వాసన, దోమల విజృంభణ కారణంగా ప్రజలకు నానా అవస్థలు తప్పడం లేదు. అధికారులకు మాత్రం 'దోమ' కుట్టినట్టైనా లేదు.


నేతాజీనగర్‌లో రహదారిపై చేరిన మురుగు నీరు

రేపల్లె రూరల్: పట్టణంలో డ్రైనేజీల నిర్వహణ అధ్వానంగా మారింది. ప్రధాన రహదారులు మినహాయించి వార్డులలో పూడికతీత సక్రమంగా నిర్వహించకపోవటంతో మురుగునీటి పారుదలకు ఆటంకం తప్పటం లేదు. చాలాచోట్ల రహదారులపైకి మురుగు చేరడంతో రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వందల మంది సంచరించే రైల్వేస్టేషన్ పక్క రోడ్డులో డ్రైనేజీ కాలువలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయి. పరిసరాల దుర్వాసనతో అటుగా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. 24 వ వార్డులోని అంతర్గత రహదారుల వెంట డ్రైనేజీలలో మట్టి, పిచ్చిమొక్కలు పెరగడంతో మురుగు నీరు నిలిచిపోయింది. ఇక్కడా రోడ్డుపైకి చేరుతోంది. మున్సిపల్ అధికారులు స్పందించి పూడిక తీయించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

సాయంత్రమైతే దోమల దాడి

రోజుల తరబడి మురుగు నీరు నిల్వ ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయి. జ్వరాలు, ఇతర వ్యాధుల భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సాయంత్రం 6 గంటలు దాటితే ఆరుబయట నిలుచోలేని పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా 28, 26, 25, 24, 23వ వార్డులలో సమస్య తీవ్రత అధికంగా కనిపిస్తోంది. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి పారిశుద్ధ్యం మెరుగుపరచటంతోపాటు దోమల నివారణకు చర్యలు చేపట్టాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.


రైల్వే స్టేషన్ సమీపంలో కాలువలో వ్యర్థాలు


24వ వార్డులో కాలువ దుస్థితి ఇదీ...

పూడికతీతకు చర్యలు



పట్టణంలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి కాల్వలలో మురుగునీరు పారుదల సక్రమంగా సాగేలా సిబ్బందితో పని చేయిస్తున్నాం. అంతర్గత రహదారులలో సైతం ఈ మేరకు చర్యలు తీసుకుంటాం. వార్డు ప్రజలు సైతం మురుగు కాల్వలలో ఎటువంటి వ్యర్థ పదార్థాలు వేయకుండా సహకరించాలి. ఇళ్లలోని వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బందికి ఇవ్వాలి. లేదంటే నిర్దిష్ట ప్రదేశాలలో పడవేయాలి.

– కాకర్ల సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్, రేపల్లె

పలు కార్యాలయాల్లో ఎస్పీ తనిఖీ

తెనాలి రూరల్: సాధారణ తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ బుధవారం తెనాలి వచ్చారు. ఉదయం కొత్తపేటలోని తాలూకా సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించారు. డీఎస్పీ జనార్ధనరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాసరావులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు. తర్వాత డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి రికార్డులను పరిశీలించారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. పలు పోలీస్ స్టేషన్ల సిబ్బందితోనూ ఎస్పీ ప్రత్యేకంగా సంభాషించారు.

రైలు నుంచి జారిపడి యువకుడు మృతి

తెనాలి రూరల్: రైలు నుంచి జారిపడి యువకుడు మృతి చెందిన ఘటన వేమూరు రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వేమూరు వద్ద పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి జేబులో ఉన్న ఆధార్ కార్డు ద్వారా అతడిని కృష్ణా జిల్లా ఎదురుమొండికి చెందిన కొల్లూరు గోపి ప్రశాంత్ (27)గా గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

లోక రక్షకుడు క్రీస్తు


వాక్యోపదేశం చేస్తున్న చిన్నాబత్తిన భాగ్యయ్య, ఫాతిమా మర్రెడ్డి


బాల ఏసు స్వరూపం

ఫిరంగిపురం: లోక రక్షకుడు ఏసు క్రీస్తు అని గుంటూరు మేత్రాసన గురువులు చిన్నాబత్తిన భాగ్యయ్య అన్నారు. మండల కేంద్రంలోని బాల ఏసు దేవాలయంలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని క్రీస్తు జయంతి మహోత్సవ జాగరణ దివ్యపూజాబలిని మంగళవారం అర్ధరాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాక్యోపదేశం చేస్తూ క్రీస్తు భూమిపై పాపుల రక్షణ కోసం తన జీవితాన్ని అర్పించారని తెలిపారు. క్రీస్తు జన్మించారనేందుకు గుర్తుగా శాంతి పావురాన్ని ఎగురవేశారు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి బుధవారం నిర్వహించిన ప్రత్యేక దివ్యపూజాబలిలో పాల్గొన్నారు. విచారణ గురువు ఫాతిమా మర్రెడ్డి, ఫాదర్ టి. డోమినిక్ పాల్గొన్నారు. ఫాదర్‌లు ఉప్పులూరి రవీంద్ర, విలియమ్, బడుగు ప్రవీణ్‌కుమార్‌లు పాల్గొన్నారు. సాయంత్రం గ్రామంలో తేర్లలో మరియ మాత స్వరూపాలను ఊరేగించారు. సీఐ రవీంద్రబాబు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా

- బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపుతప్పిన బస్సు
- 20 మంది ప్రయాణికులు సురక్షితం


పల్టీ కొట్టిన ట్రావెల్ బస్సు

నరసరావుపేట రూరల్: ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటన పల్నాడు జిల్లా పెట్లూరివారిపాలెం వద్ద బుధవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. బెంగళూరు నుంచి పిడుగురాళ్ల వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు మార్గమధ్యలో ప్రయాణికులను దింపేందుకు నరసరావుపేట వస్తోంది. పెట్లూరివారిపాలెం వద్దకు చేరుకున్న సమయంలో బ్రేకులు ఫెయిల్ కావడంతో బస్సు అదుపుతప్పింది. రోడ్డు పక్కనున్న మార్జిన్‌లోకి వెళ్లి బోల్తా కొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. స్థానికులు అక్కడకు చేరుకొని బస్సులో ఉన్న ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు. రూరల్ సీఐ పి.రామకృష్ణ, ఎస్ఐ కిశోర్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రయాణికులకు వేరే బస్సులో తరలించారు. ప్రమాద సమయంలో బస్సులోని ఆయిల్ రోడ్డుపై పడటంతో ప్రమాదాలు చోటుచేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని రోడ్డును శుభ్రం చేశారు.

'అరుణ'కీలాద్రి

- ముగిసిన భవానీ దీక్షల విరమణ
- ఇంద్రకీలాద్రిపై పూర్ణాహుతి
- 5వ రోజు కొనసాగిన భవానీల రద్దీ
- నేడు, రేపు ఏర్పాట్లు యధాతథం


దుర్గగుడి మహా మండపంలో అమ్మవారు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్ష విరమణ మహోత్సవాలు దిగ్విజయంగా పూర్తయ్యాయి. ఈ నెల 21 నుంచి ప్రారంభమైన దీక్షల విరమణ బుధవారం 5వ రోజుతో పరిసమాప్తమయ్యాయి. భవానీల రాకపోకలతో ఇంద్రకీలాద్రి పరిసరాలు, గిరి ప్రదక్షిణ మార్గం అరుణవర్ణమైంది. మంగళవారం అర్ధరాత్రి దాటాక 1.30 గంటలకు అమ్మవారికి సుప్రభాత సేవ, నిత్య పూజల అనంతరం భవానీలను దర్శనానికి అనుమతించారు. మంగళవారం సాయంత్రం నుంచి గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న భవానీలు అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత క్యూలైన్‌లోకి చేరారు. రాత్రి 12 గంటల నుంచి రద్దీ అధికం కావడంతో వీఎంసీ కార్యాలయం, సీతమ్మ వారి పాదాలు సమీపంలోని కంపార్టుమెంట్లలోకి భవానీలను పంపారు. తొక్కిసలాట జరగకుండా వారిని క్యూలైన్‌లోకి మళ్లించారు.

పూర్ణాహుతి

ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో మహా పూర్ణాహుతిని అర్చకులు, వేద పండితులు, వైదిక కమిటీ సభ్యులు చేశారు. పూర్ణాహుతి కార్యక్రమంలో ఈవో కె.ఎస్. రామరావు దంపతులు, డీఈవో రత్నరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం, ప్రసాదాల వితరణ జరిగింది. కార్యక్రమంలో స్థానాచార్య శివప్రసాద్‌శర్మ, ప్రధాన అర్చకులు ఎల్‌డీ ప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు మూడు గంటలు

దీక్షల విరమణలో సాధారణంగా భవానీలు గిరి ప్రదక్షిణ చేస్తుంటారు. 8 కిలో మీటర్ల మేర సాగే గిరి ప్రదక్షిణ మూడు గంటల పాటు సాగింది. సాధారణ పౌర్ణమి, ఇతర పర్వదినాల్లో గిరి ప్రదక్షిణకు రెండు నుంచి రెండున్నర గంటల సమయం పడుతుంది. దీక్ష విరమణలో నాలుగో రోజు రాత్రి నగరానికి చెందిన సాధారణ భక్తులు, భవానీలు గిరి ప్రదక్షిణ చేపట్టడం ఆనవాయితీ. మంగళవారం రాత్రి గిరి ప్రదక్షిణకు మూడు నుంచి మూడున్నర గంటల పాటు కొనసాగిందంటే రద్దీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

నేడు, రేపు యథావిధిగా..

దీక్షల విరమణ ముగిసినా గురువారం, శుక్రవారాల్లో ఏర్పాట్లు యథావిధిగా ఏర్పాట్లు కొనసాగుతాయని ఈవో కె.ఎస్.రామరావు తెలిపారు. గురువారం భవానీల రద్దీకి కొంత అవకాశం ఉండటంతో ఏర్పాట్లను కొనసాగిస్తామన్నారు. భక్తులు, భవానీలు వినాయకుడి, టోల్‌గేట్ నుంచి క్యూలైన్ల ద్వారా కొండపైకి చేరుకోవాలని సూచించారు. దర్శనానంతరం మహా మండపం మెట్లు, మల్లికార్జునస్వామి ఆలయం మెట్ల మీదుగా కిందకు వెళ్లాలని పేర్కొన్నారు.

మంగళవారం అర్ధరాత్రి 1.30 నుంచి బుధవారం ఉదయం 8.30 గంటల మధ్య సుమారు 20 వేల మంది భవానీలు, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం 9 గంటల తర్వాత గిరి ప్రదక్షిణ మార్గం, క్యూలో రద్దీ తగ్గింది. సాయంత్రం వరకు అమ్మవారి దర్శనానికి ఓ మోస్తరు రద్దీనే కనిపించింది. విరమణల సందర్భంగా భవానీలు 20 లక్షల లడ్డూలను కొనుగోలు చేశారు. ఆరు చొప్పున బాక్స్ ప్యాకింగ్ చేసిన లడ్డూలను ఈ ఏడాది ఆలయ నిర్వాహకులు ప్రవేశపెట్టారు. ఇప్పుడు వీటినే అత్యధికంగా విక్రయించినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.


పూర్ణాహుతిలో ఈఓ రామరావు


దీక్ష విరమిస్తున్న భవానీలు

మద్యం దుకాణంలో ఘర్షణ


దాడిలో గాయపడిన శేషు

ముప్పాళ్ల: స్థానిక మద్యం దుకాణంలో టేబుల్ వద్ద కుర్చీ విషయంలో ఇరువురి మధ్య వాదన ముదిరి జరిగిన ఘర్షణలో ఒకరు గాయపడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. గుంటూరు బ్రాంచి కాలువ పక్కనే ఉన్న ఓ వైన్స్‌లో గనికపూడి శేషు, షేక్ మస్తాన్‌వలి(కుంటిమద్ది) మద్యం తాగుతున్నారు. నరసరావుపేట మండలం ములకలూరుకు చెందిన చింత మెహర్‌బాబు, బొమ్మిశెట్టి వాసు, పి.కాళిదాసు, ఎ.కాశీలతో పాటుగా మరికొంత మంది మద్యం తాగేందుకు వచ్చారు. పక్కనే ఉన్న కుర్చీలు తీసుకుంటుండగా శేషు, మస్తాన్‌వలి తమ వాళ్లు వస్తారని, వేరే టేబుల్ వద్దకు వెళ్లాలని సూచించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాదనలు ముదిరి ఘర్షణ పడ్డారు. మస్తాన్‌వలి పై ములకలూరుకు చెందిన వారు కుర్చీతో దాడి చేయటంతో పక్కనే ఉన్న ముస్లిం యువకులు ములకలూరుకు చెందిన వారిపై ఎదురు దాడికి దిగారు. ఇరువర్గాల వారు దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో ములకలూరుకు చెందిన వారు బీరు బాటిల్ పగలకొట్టి శేషు తలపై కొట్టడంతో తీవ్ర గాయమైంది. సమాచారం అందుకున్న ఎస్ఐ యు.సోమేశ్వరరావు ఘటనా స్థలానికి చేరి ఇరువర్గాల వారిని తరిమివేయటంతో వివాదం సద్దుమణిగింది. ములకలూరుకు చెందిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన మస్తాన్‌వలి, శేషులను చికిత్స నిమిత్తం సత్తెనపల్లి వైద్యశాలకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సత్తెనపల్లి రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు ముప్పాళ్లకు చేరుకొని సంఘటనపై విచారణ చేపట్టారు.

పన్ను చెల్లింపుదారులు నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న ఐటీ అదనపు కమిషనర్ డాక్టర్ ఓఆర్ సుప్రియారావు

చిలకలూరిపేట: ఆదాయపు పన్ను చెల్లింపుదారులు నిబంధనలు అనుసరించి పన్నులు చెల్లించాలని ఆదాయపు పన్ను శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ ఓఆర్ సుప్రియారావు చెప్పారు. పట్టణంలోని శ్రీనివాస ఫంక్షన్ హాలులో ఆదాయపు పన్ను శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆదాయపు పన్ను చెల్లించే వారికి ఎలాంటి సందేహాలు ఉన్నా వాటిని పరిష్కరించేందుకు తమ సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉంటారని చెప్పారు. ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్నులు దాఖలు చేసేటప్పుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఆదాయపు పన్ను శాఖ అధికారి జి.అరుణ్‌కుమార్ మాట్లాడుతూ కచ్చితమైన క్లెయిమ్స్‌ను మాత్రమే అందజేయాలని సూచించారు. మోసపూరిత రిఫండ్స్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఆడిటర్ జి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ట్యాక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తూబాటి మూర్తి, గబ్బిటి బాల సుబ్రమణ్యం, కటకం శివరామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ కొనివ్వలేదని యువకుడు ఆత్మహత్య

కొల్లూరు: తల్లిదండ్రులు ట్రాక్టర్ కొనడానికి నిరాకరించడంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని సుగ్గునలంకలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సుగ్గునలంకకు చెందిన దూళిపూడి శ్రీనివాసరావు కుమారుడు మణికంఠ (21). ట్రాక్టర్ కొనివ్వాలని కొన్ని రోజులుగా తల్లిదండ్రులను మణికంఠ అడుగుతున్నాడు. వారు ఒప్పుకోకపోవడంతో ఈ నెల 20వ తేదీన మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు విజయవాడలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మణికంఠ సోదరుడు అశోక్‌కుమార్ ఫిర్యాదుతోపాటు వైద్యశాల నివేదిక ఆధారంగా హెడ్ కానిస్టేబుల్ మురళీకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి. ఏడుకొండలు తెలిపారు.

ఆర్ఎస్ఐ పేరుతో మహిళను మోసగించి వివాహం

- నిందితుడికి ఇప్పటికే పెళ్లయి భార్య, ఇద్దరు పిల్లలు
- బాధితురాలి ఫిర్యాదుతో పోలీసు కేసు నమోదు

కొల్లూరు: పోలీసు శాఖలో ఆర్ఎస్ఐగా పని చేస్తున్నానని నమ్మబలికి ఓ మహిళను మోసగించి వివాహం చేసుకున్న వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. కొల్లూరుకు చెందిన ఓ మహిళ 2022లో బంధువుల వివాహానికి వెళ్లారు. ఆ సమయంలో ఓ వ్యక్తి తాను ఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నానని నమ్మబలికాడు. అనంతరం పరిచయం పెరగడంతో ఈ ఏడాది ఆగస్టు 18వ తేదీన పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. కొన్నాళ్ల తర్వాత అతని ప్రవర్తనలో మార్పు గమనించిన సదరు యువతి బంధువులు ఆరా తీశారు. అతడు కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. మేడిపల్లి పృథ్వీరాజ్ చౌదరిగా చెప్పుకొన్న అతడి అసలు పేరు మేడిపల్లి వెంకటేశ్వరరావు అని, ఊరు నాగాయిలంక మండలం గణపేశ్వరం అని తేలింది. ఇప్పటికే వివాహమై భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిసింది. దీంతో బాధితురాలు మంగళవారం అతడిపై కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ సోదరి పిల్లలకు సైతం ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి డబ్బులు గుంజినట్లు పోలీసుల వద్ద ఆమె, బంధువులు వాపోయారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొల్లూరు ఎస్ఐ జి. ఏడుకొండలు తెలిపారు.

కూచిపూడి పతాక స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలి

కూచిపూడి (మొవ్వ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సహకారంతో కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీ ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించే కూచి పూడి పతాక స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ మేరకు బుధవారం నాట్య క్షేత్రం కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళా పీఠంలో వేడుకల కమిటీ కన్వీనర్ డాక్టర్ వేదాంతం వెంకట నాగ చలపతిరావు విలేకరుల సమావేశం నిర్వహించారు. మూడు రోజులపాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. దేశ విదేశాల్లో ప్రాచుర్యం పొందిన కూచిపూడి నృత్యానికి చిహ్నంగా ఏర్పాటుచేసిన పతాకం అరుదైన ఘటనని, దానికి 50 సంవత్సరాల ఉత్సవాలు నిర్వహించడం ముదావహమని వెల్లడించారు. కూచిపూడి సంస్కృతి సంప్రదాయాలను ప్రజలకు మరింత చేరువచేయాలనే లక్ష్యంగా నిర్వహిస్తున్న కూచిపూడి పతాక స్వర్ణోత్సవాల్లో పాల్గొనటానికి భారతదేశంలోని పలు రాష్ట్రాల నుంచే కాకుండా అమెరికా, రష్యా, జర్మనీ, జపాన్, రష్యా తదితర ప్రాంతాల నుంచి వస్తున్న కళాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.